విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

ఏరియా ఆసుపత్రిని ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర -ఏలూరు: ఏలూరులో ఏరియా ఆసుపత్రిని వెంటనే ఏర్పాటు చేయాలని, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రద్దు కాబడిన వైద్యులు, వైద్య సిబ్బంది, బెడ్స్ ను పునరుద్ధరించాలని అఖిలపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి మంగళవారం సిపిఐ, సిపిఎం,సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, కాంగ్రెస్, జనసేన, ఆమ్ ఆద్మీ తదితర పార్టీల నాయకులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను, ప్రభుత్వ బోధన ఆసుపత్రిలో(మెడికల్ కాలేజీ) రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్,సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పళ్లెం కిషోర్,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు, , సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నగర నాయకులు బద్ద వెంకట్రావు, జనసేన ఏలూరు సిటీ అధ్యక్షులు నగిరెడ్డి కాశి నరేష్, ఆమ్ ఆద్మీ ఏలూరు కన్వీనర్ షేక్ మస్తాన్ తదితరులు మాట్లాడుతూ ఏలూరు ప్రభుత్వ బోధన ఆసుపత్రి(మెడికల్ కాలేజీ) పేరుతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలు నిలిపివేయడం అన్యాయం అన్నారు. దానివల్ల 42 స్పెషలిస్టు వైద్యులు, 150 మందికి పైగా వైద్య సిబ్బంది, 350 బెడ్స్ రోగులకు అందుబాటులో లేకుండా పోయాయన్నారు. దీనితో రోజు జిల్లా నలు మూలల నుండి ఏలూరు వస్తున్న పేద ప్రజలకు సత్వర వైద్య సేవలు అందటం లేదన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు జిల్లా లోని అన్ని మండలాల ప్రజలు ఏలూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వస్తుంటారని తెలిపారు. ముఖ్యంగా ఏలూరు, దెందు లూరు, కైకలూరు నియోజకవర్గాల ప్రజలకు ఏలూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆధారం అన్నారు. ఒక్క ఏలూరు జనాభా 3,50,000 పైన ఉందని, ఏలూరులో ఒక ద్వితీయశ్రేణి ఆసుపత్రిని ఏర్పాటు చేసి నడపాలని కోరారు. మెడికల్ కాలేజీ పనులు ఆసుపత్రిలో రోగుల వైద్య సేవలు, పరిశీలించిన అనంతరం అఖిలపక్ష పార్టీ నాయకుల బృందం జిల్లా కలెక్టర్ కార్యాలయం కు వెళ్లారు. అక్కడ కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో డిఆర్ఓ కు వినతి పత్రం సమర్పించారు. దీనిపై కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని పేద ప్రజల ఆరోగ్య అవసరాల రీత్యా ఏలూరు ఏరియా ఆసుపత్రిని వెంటనే నిర్మాణం చేసేలాగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బి. ప్రసాద్, టీ శ్రీను ఎస్. బాలు, కాంగ్రెస్ పార్టీ ఏలూరు నాయకులు చంద్రశేఖర్, పి. బాబు ప్రసాద్, ఆమ్ ఆద్మీ పార్టీ ఏలూరు నాయకులు ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.

గోడౌన్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: ఎన్నికల సామాగ్రిని భద్రపరిచేందుకు అనువైన గోడౌన్ల ఎంపికలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్థానిక సిడబ్ల్యూసి గౌడౌన్లను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. గోడౌన్లో విద్యుత్ సౌకర్యం, పైకప్పు, షట్టర్ల భద్రత, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈవిఎంలు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచేందుకు గోడౌన్లను ఎంపిక చేయడం జరుగుచున్నది. ఈ సందర్భంలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, భీమవరం ఆర్డీవో దాసిరాజు, తహసీల్దార్ వై.రవికుమార్, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ సర్వే పరిశీలన

విశాలాంధ్ర - లింగపాలెం : లింగపాలెం మండలంలో జరుగుతున్న డ్రోన్ సర్వే పనులను నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మంగళవారం పరిశీలించారు. కొణిజర్లలో జరుగుతున్న డ్రోన్ సర్వేను ఈయన స్వయంగా చూశారు. ఈ సర్వేను వీలున్నంత త్వరగా మండలంలో పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రోజువారి నిర్దేశించిన సర్వేను ఎటువంటి ఆటంకం లేకుండా పూర్తి చేయాలని తెలిపారు. డ్రోన్ సర్వే వల్ల కరెక్టు ఫలితాలు రావాలని, దానికి అనుగుణంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రీ సర్వే వల్ల భూవివాదాలు సమసిపోతాయని, కొత్త సమస్యలు తలెత్తవని రైతులు, ప్రజలు గమనించి సహకరించాలని సబ్ కలెక్టర్ కోరారు. ఈయనతోపాటు తహశీల్దార్ ఆర్.వి.మురలీకృష్ణ, సర్వేయర్ నాగజ్యోతి, రెవెన్యూ అధికారి ఖాదర్, డ్రోన్ నిర్వహణ సాంకేతిక సిబ్బంది ఉన్నారు.

ఆయకట్టు భూములకు నీరందిస్తాం

విశాలాంధ్ర - లింగపాలెం : పాలవాగు కాలువను ఇరిగేషన్ శాఖ ఎస్ఇ శ్రీనివాస్ పరిశీలించారు. తమ్మిలేరుకాల్వ నుంచి పాలవాగు కాల్వకు నీటి సరఫరా వల్ల దాదాపు నాలుగు వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ కాల్వ అవుట్‌లెట్‌కు గండి పడటంతో కాల్వకు వచ్చే నీరు తమ్మిలేటికి వెళ్ళిపోతుంది. దీనివల్ల ఆయకట్టు భూములకు కొన్నేళ్ళుగా నీరందటంలేదు. దీని మరమ్మతుకు ఎంపీ శ్రీధర్ దాదాపు రూ. 70 లక్షలు ఎంపీ ల్యాండ్స్ నిధులు కేటాయించటంతో పనులు చేపట్టారు. ఈ ఏడాది తొలకరి కల్లా దీని మరమ్మతు చేసేందుకు చురుకుగా చర్యలు తీసుకున్నామని ఎస్ఇ తెలిపారు. వర్షాలు పడే లోపులో గ్రౌండ్ కాంక్రీట్ వేయటం పూర్తి చేస్తే ఆ తరువాత చేసే పనులు సులువవుతాయని ఎస్ఇ అన్నారు. కాంక్రీట్ పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ ఏడాది గండి మరమ్మతు పూర్తి చేసి ఆయకట్టు భూములకు సజావుగా నీటి సరఫరా చేసే చర్యలు తీసుకున్నామని వివరించారు. ఈయనతోపాటు డిఇ అర్జున్, జెఇ కిషోర్ తదితరులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్సీని పరామర్శించిన ప్రముఖులు

విశాలాంధ్ర-ఉండి: మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ టిడిపి నాయకులు మంతెన వెంకట సత్యనారాయణ రాజు(పాండువ్వ శ్రీను) తండ్రి విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు మంతెన నారాయణరాజు మృతి ఆయన కుటుంబానికి తీరనిలోటని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చెన్నాయుడు అన్నారు. ఉండి మండలం పాందువ్వ గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ మంతెన వెంకట సత్యనారాయణ రాజు ను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంతెన నారాయణ రాజు ఉపాధ్యాయునిగా పని చేసే కాలంలో విద్యాబుద్ధులు నేర్చుకున్న పలువురు నేడు బాధ్యతాయుత పదవుల్లో ఉన్నారని అటువంటి వ్యక్తి మరణం ఆయన కుటుంబానికి గ్రామానికి ఆయన శిష్యులకు తీరని లోటన్నారు. మంతెన వెంకట సత్యనారాయణ రాజును పరామర్శించిన వారిలో జిల్లా టిడిపి అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసు, ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, వేటుకూరి వెంకట శివరామరాజు, ఆరిమిల్లి రాధాకృష్ణ, బండారు మాధవ నాయుడు, జనసేన నాయకులు పత్సమట్ల ధర్మరాజు తదితరులు కలిసి తమ ప్రగాఢ సానుభూతి సంతాపం తెలియజేశారు.

సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష

విశాలాంధ్ర-మండవల్లి: సంక్షేమ పథకాల అమలు,ఈకెవైసి, ఫించన్లు తదితర అంశాలపై వెల్ఫేరు అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం మండలపరిషత్తులో మంగళవారం ఎండివో ఆనందబాబు ఆధ్వర్యంలో జరిగింది. వలంటీర్ల పురస్కారాలు, పర్యావరణ పక్షోత్సవాలు, ఆధార్ క్యాంపు వేదికల నిర్ణయంపై కార్యదర్శులతో చర్చించారు.

వలంటీర్లకు అవార్డులు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ముఖ్యమంత్రి మానస పుత్రిక వాలంటీర్ల వ్యవస్థ అని పోలవరం నియోజకవర్గ శాసనసభ్యులు తెల్లం బాలరాజు పేర్కొన్నారు. మంగళవారం రేపల్లెవాడ గ్రామంలో రోటరీ ఫంక్షన్ హాల్ వద్ద సేవ రత్న , సేవ వజ్ర అవార్డులను వాలంటీర్లకు తెల్లం బాలరాజు చేతుల మీదుగా మండలంలో ఉన్న అన్ని గ్రామాలలో పనిచేసే వాలంటీర్లకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెల్లం బాలరాజు మాట్లాడుతూ అవినీతి లేని రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రం ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ వాలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టి , అవినీతి లేని రాష్ట్రంగా ప్రతి కుటుంబానికి న్యాయం జరగాలని వాలంటీర్ల ద్వారా సమస్యలను పరిష్కారానికై రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్ళడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంజిమల రామారావు, జడ్పిటిసి సభ్యురాలు దాసరి శ్రీలక్ష్మి, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, తాసిల్దార్ పి .నాగమణి, సచివాలయ పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి నాయకులు కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

డ్రైన్ తవ్వకం పనులు ప్రారంభం

విశాలాంధ్ర -ఆకివీడు : ఆకివీడు లోని ప్రధాన మురుగు డ్రైన్ గంగానమ్మ కోడు డ్రైన్ తవ్వకం పనులను మంగళవారం ప్రారంభించారు. గత కొంతకాలంగా డ్రైన్ పూర్తి స్థాయిలో పూడుకుపోయింది. డ్రైన్ లో మట్టి దిబ్బలు పేరుకుపోయి,కిక్కిస పెరిగిపోవడంతో మురుగునీటి ప్రవాహానికి అడ్డంకి గా మారింది. చిన్నపాటి వర్షం కురిస్తే ఆకివీడు లోని అన్ని ప్రాంతాల్లో దాదాపుగా మునిగిపోతున్నాయి. దీంతో నగర పంచాయతీ అధికారులు ఈ వేసవికి డ్రైన్ల తవ్వకం పనులు ప్రారంభించాలని యోచించారు. పనిలో పనిగా పనులు ప్రారంభించారు. జెసిబి ద్వారా తవ్వకం పనులు చేపట్టారు.డ్రైన్ వెంబడి ఉన్న ఆక్రమణలు తొలగించకపోవడంతో డ్రైన్ పూర్తిస్థాయిలో పూడుకుపోయింది. మంగళవారం చేపట్టిన తవ్వకం పనుల్లో కూడా నామ మాత్రంగా చేయిస్తున్నారంటూ బాహాటంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డ్రైన్ ప్రక్షాళన పనులు పూర్తిస్థాయిలో చేయిస్తే గాని వర్షాకాలంలో ఆకివీడు ముంపు బారిన పడకుండా ఉంటుందని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిపోయిన హైస్కూల్ ఆయాల జీతాలు

విశాలాంధ్ర- ఏలూరు : కొంతమంది హెచ్ఎంలు, ఎంఈఓల నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలలో పనిచేస్తున్న 1800 మంది ఆయాలకు ఏప్రిల్ నెల జీతం ఇంకా అందలేదు. జిల్లా వ్యాప్తంగా వివిధ యాజమాన్యాల పరిధిలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న 1800 మంది ఆయాలకు ఒక్కొక్కరికి ఆరువేల రూపాయలు చొప్పున వేతనాన్ని ఏడాది క్రితం నుంచి ప్రభుత్వం చెల్లిస్తోంది. వీరి బ్యాంక్ ఎకౌంట్లకు నేరుగా వేతనాలను చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఆయాల బ్యాంక్ అకౌంట్ లను వారి ఆధార్ కార్డులకు అనుసంధానం చేయాలని ఆదేశాలు ప్రభుత్వం జారీ చేసింది. ఇందుకు సంబంధించి చర్యలు తీసుకోవాలని హెచ్ఎంలు ఎంఈఓ లను ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాలను కొందరు ఎంఈఓ లు కొంతమంది హెచ్ఎంలు పెడచెవిన పెట్టారు. దీంతో ఆయాల బ్యాంక్ ఎకౌంట్లకు ఈ -కేవైసీ జరగలేదు . ఈ కారణంగా వారికి ఏప్రిల్ నెలలో జీతాల చెల్లింపులు సి ఎఫ్ ఎం ఎస్ నిలిపివేసింది .దీనిపై ఏలూరు జిల్లా విద్యాశాఖ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ షరీఫ్‌ను వివరణ కోరగా ఇప్పటికే ఆయాల ఈ -కేవైసీ పూర్తి చేయాలని హెచ్ఎంలు ఎంఈఓ లను ఆదేశించడం జరిగిందన్నారు. కొంతమంది చర్యలు తీసుకోకపోవడం వలన మొత్తం అందరి ఆయాల వేతనాలు నిలిచిపోయాయన్నారు.

హెచ్‌డిఎఫ్‌సి ఆధ్వర్యంలో రుణమేళ

విశాలాంధ్ర-ఏలూరు: కృష్ణా-గోదావరి ప్రాంతం లోని చిన్న,సన్నకారు రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా ప్రాధాన్యతా రంగాలకు అత్యధిక ప్రాధాన్యత నిస్తూ వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి అండగా నిలుస్తున్న హెచ్ డిఎఫ్ సి బ్యాంక్ అధికారులను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అభినందించారు. స్థానిక మిని బైపాస్ లోని క్రాంతి కళ్యాణమండపంలో మంగళవారం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఆధ్వర్యంలో పియంఎఫ్ఎంఇ, పిఎంఇజిపి, ఎఫ్‌పిఓలకు చెందిన ఎస్ హెచ్ జి మహిళలకు, రైతులకు జీవనోపాదుల యూనిట్ల స్థాపనకు నిర్వహించిన లోన్ మహోత్సవాన్ని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, హెచ్ డిఎఫ్ సి బ్యాంకు గ్రూప్ హెడ్ సిఆర్బి రాహూల్ శ్యామ్ శుక్లా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఎంఎఫ్ఎంఇ, పిఎంఇజిపి పథకాల కింద పలువురు రైతు ఉత్పత్తి సంస్థలు, జెఎల్ జి,ఎస్ హెచ్ జి మహిళలకు రూ. 2వేల కోట్ల రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ సాధారణంగా ప్రభుత్వరంగ బ్యాంకులు ఎక్కువగా ప్రాధాన్యతా రంగాలకు రుణ పరపతి కల్పిస్తుంటాయని, హెచ్ డి ఎఫ్ సి వంటి ప్రైవేట్ బ్యాంకు పెద్దఎత్తున ప్రాధాన్యతా రంగానికి అత్యధిక రుణాలు మంజూరుకు ప్రాధాన్యత ఇవ్వడం శుభపరిణామన్నారు. రుణాలు తీసుకున్నవారు సానుకూల దృక్పథంతో వాటిని వినియోగించుకొని అభివృద్ధి చెందాలన్నారు. .హెచ్ డిఎఫ్ సి బ్యాంకు గ్రూప్ హెడ్ సిఆర్బి రాహూల్ శ్యామ్ శుక్లా కృష్ణా-గోదావరి ప్రాంత ఆర్థిక అభివృద్ధికి తోడ్పడేందుకు తమ బ్యాంకు కట్టుబడి ఉందన్నారు. చిన్న రైతులు , చిన్న వ్యాపారాలు , దుకాణదారులకు బ్యాంకింగ్ సేవలు విస్తృతం చేసేందుకు గ్రామీణ శ్రేయస్సుకు దోహదపడే దిశగా తమ బ్యాంకు ఒక అడుగు ముందుకు వేస్తున్నదన్నారు. తొలుత జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా, హెచ్ డి ఎఫ్ సి బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, హెచ్ డిఎఫ్ సి బ్యాంకు గ్రూప్ హెడ్ సిఆర్బి రాహూల్ శ్యామ్ శుక్లా సందర్శించారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డిడిఎం అనీల్ కాంత్, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, పశుసంవర్ధశాఖ జెడి డాక్టర్ జి. నెహ్రూబాబు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు అధికారులు, సుమన్, వెంకటేశ్వర రావు, దినేష్, శంకర్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి కేసులలో బాధితులకు సత్వర న్యాయం చేయాలి

విశాలాంధ్ర-ఏలూరు: ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులను జాప్యం లేకుండా త్వరగా పరిష్కరించి బాధితులకు సత్వరన్యాయం అందించాలని సంబంధిత అధికారులకు ఏలూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కె. పెంచల కిషోర్ ఆదేశించారు. స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విజిలెన్స్, మానిటరింగ్ సమావేశం ఆర్డిఓ కె. పెంచల కిషోర్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ సి, ఎస్ టి అట్రాసిటీ కేసుల నమోదు ఆయా కేసుల పరిష్కారానికి అధికారులు తీసుకున్న చర్యలు, బాధితులకు జరిగిన లబ్దిపై కమిటీ సభ్యులు చర్చించారు. ఎస్ సి, ఎస్ టి అట్రాసిటీ చట్టం గురించి ఎస్ సి, ఎస్ టి లతో పాటు మిగతా ప్రజానికానికి అవగాహన కల్పించాలన్నారు.ఇందుకు సంబంధించిన ఫెక్సీలను కూడా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా విజిలెన్స్ మానటరింగ్ సభ్యులు యం. అజయ్ బాబు, ప్రవల్లిక , డివిజన్ మెంబర్లు డి అబ్రహాం, రవిజైన్, ఉయ్యాల అప్పారావు, ఏలూరు ఎఎస్ డబ్ల్యూఓ కె. త్రిమూర్తులు, ఉంగుటూరు, కైకలూరు సహాయ సాంఘీక సంక్షేమ అధికారులు, పోలీసు, రెవిన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి

విశాలాంధ్ర - గణపవరం: విధి నిర్వహణలోఉన్న జర్నలిస్టులపై దాడి చేయడం పత్రిక స్వేచ్ఛను హరించడమేనని ఏపీయూ డబ్ల్యూజే ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులు తన్నీడి పెద్ద పుల్లారావు అన్నారు. జర్నలిస్టులపై దాడులు ఖండిస్తూ ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు గణపవరం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలోగణపవరం తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం తహసిల్దార్ పమ్మి లక్ష్మికి వినతి పత్రం అందజేయడం జరిగింది.ఈకార్యక్రమంలో గణపవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొమ్మూరి హరి శ్రీమన్నారాయణ, కార్యదర్శి చేబ్రోలు సత్యనారాయణ (ప్రసాద్), ఎం కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులు గోపాల్ రాజు, కోశాధికారి సంకు ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విధాన పరిషత్ చైర్మన్‌ను పరామర్శించిన చెల్లబోయిన

విశాలాంధ్ర -భీమవరం: ఇటీ వల జరిగిన వైద్య చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విధాన పరిషత్ చైర్మన్ కొయ్యే మోషేన్ రాజును ఐఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు మంగళవారం పరామర్శించి త్వరగా కోలుకుని సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కొయ్యే మోషేన్ రాజు మాట్లాడుతూ తాను స్వయం కృషితో అట్టడుగు స్థాయి నుండి విధాన పరిషత్ చైర్మన్ స్థాయి వరకు ఎదిగానన్నారు. అప్పట్లో ఎఐఎస్ఎఫ్ తోను, చెల్లబోయిన రంగారావుతోను, అప్పటి సిపిఐ నాయకులతో తనకున్న అను బంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఐఎల్ జిల్లా కౌన్సిల్ సభ్యులు వై.వి.ఆనంద్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎం.లక్ష్మిపతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

విశాలాంధ్ర-ఆకివీడు : ఆకివీడు శివారు కోళ్ల పర్రు వంతెన సమీపాన మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందాడు. తరటావ గ్రామానికి చెందిన గంగుల తేజ (16) ఆకివీడు వెళ్లి తిరిగి తన స్వగ్రామానికి వస్తుండగా కోళ్ల పర్రు నుండి గుమ్ములూరు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో తేజ తలకు తీవ్ర గాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తేజ ను వెనుక నుండి లారీ ఢీకొందని ప్రత్యక్ష సాక్షుల కథనం. ఢీకొన్న లారీ వేగంగా వెళుతుండడంతో లారీని వెంబడించి స్థానికులు పట్టుకున్నారు. సంఘటన స్థలానికి మృతుడి బంధువులు చేరుకున్నారు. వారి రోదనలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది. తేజ ఇటీవలే పదవ తరగతి పరీక్షలలో పాస్ అయ్యాడు . విజయవాడలో చేర్పించేందుకు కుటుంబ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. ఈలోపే ఈ సంఘటనతో కుటుంబ సభ్యులంతా తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. సంఘటనా స్థలానికి ఆకివీడు పోలీసులు వచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆకివీడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులు

విశాలాంధ్ర - నిడమర్రు: ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులు వాలంటరీ వ్యవస్థ అని ఉంగుటూరు శాసనసభ్యులు శ్రీనివాసరావు వాసు బాబు అన్నారు. మంగళ వారం నిడమర్రు మండలం, మందలపర్రు గ్రామంలో గాది రాజు గోపాల కృష్ణంరాజు కల్యాణ మండపంలో వలం టీర్లకు వందనం అవార్డులు ప్రదానోత్సవం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్తమ వాలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర మూడు కేటగిరీల్లో ప్రభుత్వం వరుసగా మూడవ ఏడాది అవార్డులుతో వాలంటీర్లు అందరినీ సత్కరిస్తోందన్నారు.. జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు కోడే కాశీ, ఎంపీపీ దనుకొండఆదిలక్ష్మి ,వైయస్సార్ పార్టీ మండల కన్వీనర్ సంకు సత్య కుమార్ ,వైస్ ఎంపీపీ సమయం వీర రాఘవులు, నిడమర్రు ఎంపీడీవో పివివి ప్రకాష్, గణపవరం ఎంపీడీవో గద్దల జ్యోతిర్మయి, అధికారులు, వలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరం

విశాలాంధ్ర - పోడూరు : మండలం లోని జిన్నూరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళ వారం మ్యాజిక్ షో జరిగింది. విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఎ. దేవేంద్ర అప్పారావు ఇంద్రజాల ప్రదర్శన చేశారు. మంటలనుండి జాతీయ జెండా తీయటం, ఖాళీ పేపర్స్ ను రంగు రంగుల క్లాత్ గా మార్చడం వంటి అంశాలు ప్రదర్శించారు. మద్యపానం, ధూమపానం వల్ల కలిగే అనర్థాలను సైన్స్ సూత్రాలతో వివరించారు. రిటైర్డ్ ఎంఈఓ, జ్ఞాన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి వై.అజయ్ కుమార్ గణితంలో చిట్టి చిట్టి ప్రయోగాలు చేశారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి జమ్ము రామ లక్ష్మణ్ సైన్స్ లో చిట్టి చిట్టి ప్రయోగాలు చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దండు కృష్ణంరాజు కార్యదర్శి తాళాబత్తుల వెంకటేశ్వర రావు గ్రంథ పాలకురాలు బత్తుల జోగారత్నం విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ శిక్షణా తరగతులు జయప్రదం చేయండి

విశాలాంధ్ర -భీమవరం: ఈ నెల 28, 29, 30వ తేదీల్లో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భీమవరం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో జరిగే కోస్తాంధ్ర జిల్లాల విద్యా, వైజ్ఞానిక, రాజకీయ, సైదాంతిక శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.సుందర్, టి.అప్పలస్వామి విజ్ఞప్తి చేశారు. మంగళవారం డిఎన్నార్ కళాశాల కూడలిలో ఎఐఎస్ఎఫ్ నాయకులు శిక్షణా తరగతుల కరపత్రాలను పంచి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం తీసుకువచ్చి విద్యను ప్రైవేటీకరణ కార్పొరేటీకరణ కషాయీకరణ చేయడానికి కుట్ర చేస్తున్నదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 77ని తీసుకువచ్చి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని రద్దు చేశారని దీంతో వేలాది మంది విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యారని ధ్వజమెత్తారు. ఈ తరుణంలో విద్యార్థులను రాజకీయంగా, సైద్ధాంతికంగా చైతన్యవంతులను చేయడానికి మే 28 , 29, 30 వ తేదీల్లో మూడు రోజుల పాటు జరిగే కోస్తాంధ్ర జిల్లాల విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణా తరగతులు భీమవరం లో నిర్వహించ నున్నామని, ఈ శిక్షణా తరగతులకు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమం లో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.మణిదీప్, వై.సంతోష్ , యు.మురళి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ మెరిట్ విద్యార్థులకు సత్కారం

విశాలాంధ్ర-ఏలూరు: పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రభుత్వం సత్కరించనుంది. జిల్లావ్యాప్తంగా నియోజకవర్గస్థాయిలో టెన్త్ విద్యార్థులు 59 మంది, జిల్లాస్థాయిలో 35 మంది కలిపి మొత్తం 94 మంది టెన్త్ విద్యార్థులను సత్కరించనున్నారు. ఈనెల 25న నియోజకవర్గం స్థాయిలో సత్కార కార్యక్రమం జరగనుంది. నియోజకవర్గ స్థాయిలో మొదటి, రెండవ ,మూడవ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.15, 10, 5వేల నగదు బహుమతి అందిస్తారు .ఇంటర్ టాపర్లకు రూ.15 వేలు నగదు బహుమతి అందిస్తారు. ఈ నెల 27న జిల్లా కేంద్రమైన ఏలూరులో జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించి ప్రథమ ,ద్వితీయ ,తృతీయ స్థానాలు లో నిలిచిన వారికి రూ.50,30, 15వేల నగదు బహుమతి అందజేస్తారు. ఇంటర్‌లో ఒక్కొక్క గ్రూపులో టాపర్ కి రూ.50 వేలు చొప్పున నగదు బహుమతి అందిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌వి రవి సాగర్ తెలిపారు.

నేడు జర్నలిస్ట్ ప్రతాప సంతాప సభ

విశాలాంధ్ర-ఏలూరు : సీనియర్ జర్నలిస్ట్, కొత్త దర్బార్ వ్యవస్థాపకులు, సాహిత్య మండలి సభ్యులు, బ్రాహ్మణ సేవా సమాఖ్య ఉపాధ్యక్షులు ఎస్.ఆర్.ప్రతాప ఈ నెల 11న ఆకస్మికంగా మృతి చెందారు. ఈ నెల 24 న సాయంకాలం 5 గంటలకు, ఏలూరు మార్కండేయ వేద పాఠశాలలో సంతాప సభ ఏర్పాటు చేసినట్టు ఏలూరు బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షులు, న్యాయవాది సీఏపి రామానుజాచార్యులు, సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లభోట్ల పురుషోత్తం తెలిపారు. ప్రతాప మిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులు కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు.

కంటి పట్ల శ్రద్ధ చూపాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం సి.హెచ్.అగ్రహారం గ్రామంలో డాక్టర్ వై యస్ ఆర్ కంటి వెలుగు కార్య క్రమంలో భాగంగా మంగళవారం గ్రామంలో అర్హులైన 60 సంవత్సరాలు దాటిన వృద్ధులు 61మందికి నేత్ర వైద్య అధికారి ఐ.శ్రీనివాస్ కంటి పరీక్షలు నిర్వహించారు. అందరికీ కళ్లజోళ్లు అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పిప్పర పి. హెచ్.సి వైద్యాధికారిణి డాక్టర్ కె.ప్రియాంకా మాట్లాడుతూ వృద్ధులు కంటి పట్ల శ్రద్ధ వహిస్తూ చాలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చుక్కా అప్పారావు, ఎంపీటీసీ పి.శివ నారాయణ,సి.హెచ్.ఓ జె.విల్సన్ బాబు, ఆరోగ్య సహాయకుడు నామాల రాజు,ఇన్ చార్జి కార్య దర్శి ఆర్. డి.రామారావు,ఎం ఎల్ హెచ్ పి మాధురి ప్రకాష్, ఏఎన్ఎం ఏసమ్మ, ఆశ కార్యకర్తలు బి.లక్ష్మీ భవాని, పి.దుర్గ,వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పశుగ్రాస కొరత లేదు

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లాలో ఎటువంటి పశుగ్రాస కొరత లేదని పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి. నెహ్రూబాబు తెలిపారు.ఈ ఏడాది 79 వేల మెట్రిక్ టన్నుల వరిగడ్డి అందుబాటులో ఉందన్నారు. దీంతో పాటు రైతు భరోసా కేంద్రాలకు ద్వారా రైతులకు 2 వేల 612 మెట్రిక్ టన్నుల సమీకృత దాణాను సబ్సిడీ ద్వారా అందజేసినట్టు తెలిపారు. మరో 165 మెట్రిక్ టన్నులను గడ్డి విత్తనాలను సబ్సిడీ ద్వారా రైతులకు సరఫరా చేసినట్టు తెలిపారు. ఈ దృష్ట్యా జిల్లాలో ఎటువంటి పశుగ్రాస కొరత లేదని ఆయన స్పష్టం చేశారు.

జీవీ మృతి సేవా కార్యక్రమాలకు తీరని లోటు

విశాలాంధ్ర -భీమవరం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు మేనల్లుడు జి.వి.సత్యనారాయణరాజు మృతి సామాజిక సేవా రంగాలకు తీరని లోటని మేజిక్ స్టార్ బోస్ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జి.వి.సత్యనారాయణరాజు మృతికి మంగళవారం ఆయన నివాళులర్పించి మాట్లాడుతూ ప్రత్యేక మన్యం జిల్లా ఏర్పాటుకు ఆయన ఎంతో శ్రమించారన్నారు. ఆదివాసి ప్రాంతాల్లో ఆయన ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని, సమైక్యాంధ్ర ఉద్యమాల్లోను, పోలవరం ప్రాజెక్టు ఉద్యమాల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నారని, అజాదికా అమృత మహోత్సవాల్లో భాగంగా గత ఏడాది కేంద్ర ప్రభుత్వం భీమవరంలో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహావిష్కరణ ఏర్పాట్ల లోను ఆయన తనవంతు సేవలందించారని గుర్తుచేసుకున్నారు.

విద్యుత్ కొనుగోలు పై విచారణ సంఘాన్ని ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర- నూజివీడు టౌన్ : విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలపై విచారణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడు విద్యుత్ శాఖ ఈ ఈ కార్యాలయం వద్ద పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా టిడిపి శ్రేణుల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్దరబోయిన వెంకటేశ్వరరావు , నియోజవర్గ పరిశీలికుడు బొడ్డు వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ విద్యుత్ కొనుగోళ్ళు అవినీతిపై విచారణ సంఘాన్ని ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగింపు కూడా అవినీతి కోసమే అన్నారు. టిడిపి హయాంలో ఎటువంటి విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయ విద్యుత్ సరఫరా చేశామన్నారు. బహిరంగ మార్కెట్ లో విద్యుత్ సరఫరా ధర 8.77 ఉండగా సిజియస్ విద్యుత్ ధర రూ.6గా ఉందన్నారు. తక్కువ ధరకు వచ్చే సిజీయస్ ను ఎందుకు కొనుగోలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలు కొనసాగుతున్నా విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా థర్మల్ పవర్ స్టేషన్లలో బొగ్గు నిలువలు సరిపడా ఎందుకు ఉంచడం లేదన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని విద్యుత్ లో నిరంతరాయం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి నూజివీడు మండల అధ్యక్షులు ముసునూరు రాజా, పట్టణ అధ్యక్షులు మలి శెట్టి జగదీష్ , నియోజవర్గ తెలుగు రైతు అధ్యక్షులు జగ్గవరపు వెంకటరెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు అరికోటి సంగీత రావు , పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పశువుల పాక దగ్ధం

విశాలాంధ్ర-టి నరసాపురం: విద్యుత్ ప్రమాద ఘటనలో పశువుల పాక దగ్ధమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బొర్రంపాలెం గ్రామానికి చెందిన రాజు పశువుల పాకపై గల విద్యుత్ వైర్లు గాలికి ఒకదానికి మరొకటి తగిలి మంటలు వ్యాపించడంతో స్థానికులు అప్రమత్తమై కట్టివేసి వున్న పశువులను విడిపించడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులు దూరం

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించి దోమల వ్యాప్తికి అడ్డుకట్ట వేయడం ద్వారా సీజనల్ వ్యాధులు దూరం అవుతాయని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి. లక్ష్మణరావు అన్నారు. మంగళవారం వెంకటరామన్నగూడెం, మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రముల పరిధిలోని మోదుగుంటగుంట, పుల్లాయగూడెం గ్రామంలో జరుగుతున్న వెక్టర్ కంట్రోల్ హైజిన్ కార్యక్రమన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వై.వి. లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యపరంగా అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తూ ఆహార నియమాలు పాటించాలన్నారు. నివాసిత ప్రాంతాల్లో మురుగునీరు నిల్వలు లేకుండా పరిసరాలు పరిశుభ్రత పాటిస్తే దోమలు ద్వారా వచ్చే వ్యాధులతో పాటు సీజనల్ వ్యాధులను కూడా నియంత్రణ చేయవచ్చని అన్నారు. పాటించడం వారంలో ఒక్క రోజు డే ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టడానికి అవకాశం ఉందన్నారు. దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్య, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులకు కళ్లెం వేయాలంటే ప్రతి ఒక్కరూ భాద్యతతో గృహాల వద్ద పరిశుభ్ర మైన వాతావరణంకల్పించుట ద్వారా దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. శైలజ, ఆరోగ్య సహాయకులు హరనాథ్ బాబు, ఈ. కాంతారావు, భాస్కర రావు, ఎం. ఎల్. హెచ్.పి.లు, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి పాండురంగ, ఎం.ఎల్.హెచ్.పి, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పెరిగిన విద్యుత్ చార్జీల ధరలు తగ్గించాలని కోరుతూ గవరవరం విద్యుత్ ఉప కేంద్రం వద్ద టిడిపి నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కార్యాలయ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న ప్రభుత్వ పరిపాలన తీరు చూస్తుంటే రాబోవు రోజుల్లో సామాన్య మానవుడు బ్రతకాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేలా ఉందని, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచడంతో, కుటుంబాన్ని పోషించుకోలేక సతమతమవుతున్న సామాన్య ప్రజలపై విద్యుత్ చార్జీలు పెంచి రాష్ట్ర ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, విద్యుత్ కోతలు నిలిపివేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పారేపల్లి నరేష్, పట్టణ అధ్యక్షుడు జేష్ట రామకృష్ణ, పోలవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు, యాగంటి హరిబాబు, సుధ గాని సత్యనారాయణ, నల్లూరు గోపి, తాతారావు ,కర్రీ సత్యనారాయణ, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో త్రాగునీరు సరఫరా

విశాలాంధ్ర - నిడమర్రు: నిడమర్రు మండలం చిననింద్రకొలను (పత్తేపురం) గ్రామ ప్రజలు త్రాగునీరు సమస్యతో ఇబ్బంది పడుతున్నారని జనసేన నాయకులు తెలియచేయగా వెంటనే స్పందించి శ్రీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకర్ ద్వారా పాడి దిబ్బ శివారు ప్రాంత ప్రజలకు తాగునీరును సరఫరా చేశారు. ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్ చార్జ్ పత్సమట్ల ధర్మరాజు ఆర్థిక సహకారంతో వాటర్ ను అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు నడింపల్లి కళ్యాణ్ వర్మ,గ్రామ జనసైనికులు,తదితరులు పాల్గొన్నారు.

రంగు పేపర్లతో ఫోటో ఫ్రేమ్

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రంగు పేపర్లతో ఫోటో ఫ్రేమ్ లను తయారు చేయడం సులువుగా నేర్చుకోవచ్చని గ్రంథ పాలకురాలు యు.రాముడు పేర్కొన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం 16 రోజులకు చేరుకోవడంతో విజ్ఞాన శిబిరంలో విద్యార్థినీ విద్యార్థులకు గ్రంథ పాలకురాలు రాముడు పుస్తకాలు చదివించడం, రాయించడం, రంగు పేపర్లతో పువ్వులు తయారు చేయడం, ప్రత్యేక ఆకర్షణగా ఫోటో ఫ్రేమ్ లను తయారు చేయడం నేర్పించారు. గ్రంథాలయాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: విద్యుత్ కోతలను నిరసిస్తూ రాష్ట్ర తెలుగు దేశం పార్టీ ఆదేశాలు మేరకు మండల తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం టి నరసాపురం విద్యుత్ సబ్ స్టేషన్ ను ముట్టడించి టి నరసాపురం నుండి కామవరపుకోట వెళ్ళే రహదారి పై రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఎల్ఐఎఎస్ఎస్ ప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని ,అప్రకటిత కరెంటు కోతలను ఆపాలని,మోటార్లకు మీటర్లు బిగించడాన్ని విరమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్, ఆచంట అనిల్ కుమార్, కొండపల్లి రవి, బొంతు సత్యనారాయణ,పెద్దిన సత్యనారాయణ, అగ్ని పర్తి భిక్షమయ్య, దాసరి చంద్రశేఖర్, కొల్లి రమేష్, కాసన్నేని మాధవ రావు, పెండ్యాల ప్రసాద్, దేవరపల్లి రంగారావు, పేరం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలకు నిరసనగా ధర్నా

విశాలాంధ్ర- తణుకు: పెరిగిన కరెంటు కోతలు, పెరిగిన విద్యుత్ చార్జీల కు నిరసనగా మంగళవారం తణుకు నియోజకవర్గంలో గల విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద టిడిపి ఇంచార్జ్,మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 7సార్లు విద్యుత్ చార్జీలను పెంచిందని విమర్శించారు. విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలంటూ డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఎప్పుడు కరెంటు ఉంటుందో, ఎప్పుడు కరెంటు వస్తుందో తెలియని అయోమయ పరిస్థితిలో ఉంటున్నారని ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించి కోతలు లేని కరెంటును ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఇరగవరం మండల ప్రెసిడెంట్ గోపిశెట్టి రామకృష్ణ, ఆరేటి రామారావు, చవ్వాకుల సత్యనారాయణ, కునుకు సత్తిబాబు, సుబ్బిరెడ్డి, దత్తు రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పది

విశాలాంధ్ర -భీమవరంటౌన్ : అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పదని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని సుంకర పద్దయ్య వీధిలోని ఆంజనేయ స్వామి మహోత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలని సూచించారు. స్వామివారి మహోత్సవాలను ఘనంగా నిర్వహించిన నిర్వాహకులను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. స్వామివారి మహోత్సవాల ముగింపును పురస్కరించుకుని వేలాది మందికి అన్న సమారాధన చేయడం అంటే భగవత్ సేవతో సమానమని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

ఓటు బ్యాంక్ రాజకీయాలతోనే కొల్లేరు ఆక్రమణలు

విశాలాంధ్ర-మండవల్లి: సహజసిద్ధమైన ప్రకృతి వనరులను రక్షించుకోగలిగితేనే జీవరాశుల మనుగడ సాఫీగా సాగుతుందని విశ్రాంత చిత్రలేఖనోపాధ్యాయుడు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఏలూరు జిల్లా నాయకులు ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. మంగళవారం మండవల్లిలో మాట్లాడుతూ కొల్లేరు ఆపరేషన్ తదనంతరం కొల్లేరులో ఆక్రమణలకు పలువురు స్వార్ధపరులు చక్రం తిప్పుతున్నారని చిత్తడి నేలలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. వన్యప్రాణులకు నెలవైన కొల్లేరులో ఓటుబ్యాంకు రాజకీయాలతో ఆక్రమణలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు కొల్లేరు ప్రాంతాన్ని,అక్కడి ప్రజల జీవన స్థితి గతులను మెరుగు పరచాల్సిన విషయాలను మరిచారని పర్యాటక క్షేత్రంగా కొల్లేరును అభివృద్ధి చేస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరిగేవన్నారు. కొల్లేరులో ఆక్రమణలను అడ్డుకోవటంతో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా భాద్యతగా వ్యహరిస్తే కొల్లేరుకు పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజకీయనేతలు సైతం ఎన్నికల సమయాల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని కొల్లేరు పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని ఆక్రమణలను అడ్డుకోవాలని సూచించారు.

వాలంటీర్ల ద్వారా మేలైన సేవలు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: వాలంటీర్ల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల వద్దకు తీసుకు వెళ్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ కే దక్కుతుందని చింతలపూడి శాసన సభ్యులు వి.ఆర్. ఎలిజా తెలియచేశారు. మంగళవారం స్థానిక రాజా రాణి కళ్యాణ మండపం లో రాష్ట్ర ప్రభుత్వం తరపున జరిగిన వాలంటీర్లకు వందనం కార్యక్రమం మున్సిపల్ కమీషనర్ పి భవానీ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి చింతలపూడి శాసన సభ్యులు వి.ఆర్. ఎలీజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ఎలిజా మాట్లాడుతూ రాష్ట్రంలో సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థ ను ఏర్పాటు చేసి ప్రజలకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజల మన్ననలు పొందుతున్న ఏకైక ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వం అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాలంటీర్లను ఎమ్మెల్యే ఎలిజా సేవా వజ్ర,సేవా రత్న,సేవా మిత్ర అవార్డులతో ఘనంగా సత్కరించి,సర్టిఫికేట్ లు అందచేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి,వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు (అంజి),వైస్ చైర్ పర్సన్ కంచర్ల వాసవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర- జంగారెడ్డిగూడెం : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చింతలపూడి ఎమ్మెల్యే వి.ఆర్. ఎలీజా అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారంతో 145 వ రోజుకు చేరుకుంది. స్థానిక 7 వ వార్డులో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎలీజా కు ఆవార్డు కౌన్సిలర్ దిరిసిపాము ధనలక్ష్మి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఎలీజా,అధికారులు,ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందజేస్తున్నామని, ఎవరైనా అర్హులు ఉంటే వెంటనే అధికారులు స్పందించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పేద,బడుగు,బలహీన వర్గాల ప్రజలకు అందచేసే సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంత వరకు మేలు చేశాయని బేరీజు వేసుకుని,ప్రజల సలహాలు,సూచనలు తీసుకుని రాబోయే సంవత్సరంలో మరింత ప్రజా రంజకమైన పరిపాలన అందించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం రూపొందించారని మన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి, మున్సిపల్ కమీషనర్ పి.భవానీ ప్రసాద్, పట్టణ వైసీపీ అధ్యక్షులు పి పి ఎన్ చంద్రరావు,ఏలూరు జిల్లా వైసీపీ మహిళా విభాగ అధ్యక్షురాలు వందనపు సాయి బాల పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ రైతు కూలీలతో జనసేన ముఖాముఖి

విశాలాంధ్ర - సీతానగరం : ఉపాధిహామీ రైతు కూలీలతో జనసేన ముఖాముఖి నిర్వహించింది. రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి మేడ గురుదత్త ప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలో నలగొండ గ్రామంలో జనసేన జన జాగృతి యాత్రలో భాగంగా ఉపాధి హామీ పని చేస్తున్న రైతుకూలీలను ఉదయాన్నే వారి దగ్గరకి వెళ్లి వారి గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు గురుదత్త ప్రసాద్‌తో మాట్లాడుతూ వారి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. వర్షాకాలంలో మేము చాలా ఇబ్బందులు పడుతున్నామని తక్షణమే డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని మాకు జనసేన పార్టీ తరపున మీరు అండగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ మండల పార్టీ అధ్యక్షులు మండపాక శ్రీను, సీతానగరం మండల పార్టీ అధ్యక్షులు కారిచర్ల విజయ్ శంకర్, మండలం కో-కన్వీనర్ కాత సత్యనారాయణ,గొల్లకోటి కృష్ణ, దేవన కృష్ణ చదువు ముక్తేశ్వరరావు, గేదల సత్తిబాబు, తన్నీరు తాతాజీ, చదువు నాగేంద్ర, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మినీ మహానాడు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-దేవరపల్లి: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధించి దేశం ప్రభుత్వ ఏర్పాటు చేసి ఎన్టీఆర్ శతజయంతి ఘన నివాళిగా అంద జేస్తామని గోపాలపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మద్దిపాటి వెంకటరాజు వెల్లడించారు. దేవరపల్లి మండలం గౌరీ పట్నంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆంద్రు అనిల్ స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు తెలుగుదేశం పార్టీ మహానాడు ఈనెల 27 28 తేదీలలో రాజమండ్రిలో నిర్వహిస్తున్నామని తెలిపారు. మహానాడు తో పాటు అన్న ఎన్టీ రామారావు శతజయంతి వేడుకలు కూడా ఘనంగా నిర్వహిస్తున్నామని మద్దిపాటి తెలిపారు. ప్రతి మండలం నుండి నాలుగు నుండి ఐదు వేల మంది కార్యకర్తలను రాజమండ్రి మహానాడుకు వెళ్లే విధంగా సమాయత్తం చేస్తున్నామని తెలిపారు.

మహానాడు విజయవంతం చేయండి

విశాలాంధ్ర - పిఠాపురం : ఈనెల 27. 28 తేదీలలో రాజమండ్రిలో జరగబోవు తెలుగుదేశం పార్టీ మహానాడును విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే వర్మ పిలుపునిచ్చారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో పిఠాపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకుల, కార్యకర్తల సమావేశం మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రాజమండ్రిలో జరగబోవు మహానాడు పై చర్చించారు.

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వెండి తొడుగు వితరణ

విశాలాంధ్ర - అంబాజీపేట : దశాబ్ద కాలంనకు పైగా పుల్లేటికుర్రు శివాలయంలోను, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయాలలో ఎన్నో దైవ కార్యక్రమాలు చేస్తున్న సర్వేజనా సుఖినోభవంతు ట్రస్టు వారి ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి పాన పట్టమునకు సుమారు నాలుగున్నర కిలోల వెండితో తొడుగును చేయించి, శాస్త్రోక్తంగా పండితులచే సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించి, స్వామి వారికి అలంకరించారు. పుల్లేటికుర్తి లింగయ్య, వెలవలపల్లి వ్యాఘ్రి, వెలవలపల్లి సుబ్రహ్మణ్యం తదితరులచే నవగ్రహ శాంతి హోమ, సంప్రోక్షణ కార్యక్రమానంతరం పానపట్టమునకు అలంక రించడం జరిగింది. సర్వేజనా సుఖినోభవంతు ట్రస్టు ప్రధాన కార్యదర్శి వక్కలంక రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చైర్మన్ అయ్యగారి వ్యాఘ్రేశ్వర సతీష్ రాజు, కార్యదర్శి పొన్నాడ విశ్వనాధ్ రాజు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

టీడీపీ మండల కమిటీ నియామకం

విశాలాంధ్ర - కరప : కరప తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆదేశాల మేరకు ఎస్సీ మండల కమిటీ నియమించినట్టు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దేవు వెంకన్న తెలిపారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా జి. భావారం గ్రామానికి చెందిన గుండపు రాజేష్, మండల ప్రధాన కార్యదర్శిగా సవరపు సత్తిబాబు, మండల మహిళా విభాగం అధ్యక్షురాలుగా కోన వెంకటలక్ష్మిని పార్టీ నియమించడం జరిగింది. తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు నాయకులు కార్యకర్తలు, కృషి చేయాలని దేవు వెంకన్న కోరారు.

అభయ ఆంజనేయస్వామి ఆలయం వద్ద భారీ అన్నదానం

విశాలాంధ్ర - కిర్లంపూడి : కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడిలో వేంచేసి యున్న శ్రీ అభయాంజనేయ స్వామి జయంతి వేడుకలను అభయాంజనేయ ఓల్డ్ ఐరన్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జయంతి వేడుకలను పురస్కరించుకొని గత వారం రోజులుగా ఆలయంలో ఆలయ అర్చకులు పొన్నా సుబ్రహ్మణ్య శర్మ బృందం ఆధ్వర్యంలో స్వామివారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి 24వ వార్షికోత్సవం, స్వామి వారి జయంతి వేడుకలను పురస్కరించుకుని స్వామివారిని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంతో పాటు కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబి, మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు తదితరులు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆలయం వద్ద ఓల్డ్ ఐరన్ సంఘం ఆధ్వర్యంలో మూడు గ్రామాల భక్తులు, పెద్దలు, ప్రజలు సహాయ సహకారాలతో మంగళవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి కిర్లంపూడి,చిల్లంగి, జగపతినగరం గ్రామాలతో పాటు చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొని స్వామివారిని దర్శించుకోవడమే కాకుండా స్వామి వారి అన్న ప్రసాదము స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆరుగుల అర్జున, వేగి శ్రీనివాసరావు, యల్లపు రమణ, చల్లా సత్యన్నారాయణ, అబ్బు, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న దాన కార్యక్రమానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

విశాలాంధ్ర - చాగల్లు : మండలంలోని చంద్రవరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉపాధ్యాయురాలు ఈ. జీ.వి సుబ్బలక్ష్మి విద్యార్థులచే గ్రంథాలయంలో లభ్యమయ్యే దినపత్రికలు, పుస్తకాల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. విద్యార్థులతో పంచతంత్ర కథలు, మర్యాద రామన్న కథలు చదివించారు. విద్యార్థి దశ నుండే కష్టపడే తత్వాన్ని కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. చిన్నారులచే ఇంగ్లీష్ వర్డ్స్, వాటికి తెలుగులో అర్థాలు టేబుల్స్ చెప్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు కె.సుమన్ కుమార్, విద్యార్థిని విద్యార్థులు పాఠకులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు రామిశెట్టి

విశాలాంధ్ర-గంపలగూడెం : ఊటుకూరు గ్రామ సర్పంచిగా 35 సంవత్సరాలు ఏకధాటిగా పరిపాలించిన వ్యక్తి, ఆదర్శ కమ్యూనిస్టు రామిశెట్టి వేణుగోపాలరావు అని ఆయన సేవలు మరువలేనివని సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా అన్నారు. మండలంలోని ఊటుకూరు గ్రామంలో మంగళవారం సీపీఐ కార్యాలయం భూపేష్ గుప్తా భవనంలో జరిగిన వేణుగోపాల్‌రావు 18వ వర్ధంతి సభలో ఆయన ప్రసంగించారు. గ్రామ పంచాయతీలకు ఎటువంటి ప్రభుత్వ నిధులు లేని రోజుల్లోనే ప్రజలను భాగస్వామ్యం చేసి గ్రామంలో పశువుల ఆసుపత్రి, ప్రభుత్వ ఆసుపత్రి, గ్రంథాలయం, తాగునీరు, సాగునీరు కోసం తీవ్రంగా కృషి చేశారని కొనియాడారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ఊటుకూరు గ్రామాన్ని జిల్లాలో ఉత్తమ గ్రామ పంచాయతీగా రెండుసార్లు ఎంపిక చేసి అవార్డులు ఇచ్చిందని అన్నారు. ఆయన సేవలు ప్రజలు మరువలేనివని కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని నాగూల్‌మీరా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామిశెట్టి మాధవరావు, రామిశెట్టి జయరాజు, సిద్ది వైకుంఠరావు, రామిశెట్టి సరస్వతి, బొమ్మన అనంత రాములు తదితరులు పాల్గొన్నారు.

బాపూజీ కలలు కన్న స్వరాజ్యం వలంటీర్లతో సాకారం

విశాలాంధ్ర - పెదపూడి : పూజ్య బాపూజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం వాలంటీర్లతో సాకారమయ్యిందని ఎంపీపీ కేతా తులసి అన్నారు. కైకవోలు, కుమారప్రియం, పెద్దాడ గ్రామాల సర్పంచులు నూని పట్టాభిరామన్న చౌదరి, డొకుబుర్ర మీనాక్షి అధ్యక్షతన సేవా రత్న, సేవా మిత్ర గ్రామ వలంటీర్లను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్సీపీ 2024లో మళ్లీ అధికారంలోకి రావాలంటే వలంటీర్లు మరింతగా మెరుగ్గా పని చేసి ప్రజల్లో జగన్ ప్రభుత్వంపై విశ్వాసం పెంచాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు నేరుగా పథకాలు అందుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలు అమలులో అవినీతి అక్రమాలకు తావులేకుండా ప్రజలకు చేరవేస్తూ ప్రభుత్వ ప్రతిష్టను పెంచుతున్న వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీఓ కర్రి హరికృష్ణ సత్యరెడ్డి. ఉప సర్పంచి కొప్పిశెట్టి వీరశంకర్(పండు), కుమారప్రియం గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పెమ్మనబోయిన సత్తిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు యాళ్ల మాధవి, వైఎస్సార్సీపీనాయకులు ఎల్లే సత్తిబాబు, పార్లమెంటు నియోజకవర్గం బీసీసెల్ కన్వీనర్ కేతా శ్రీను, పాలచర్ల రామకృష్ణ చౌదరి, డొకుబుర్ర కృష్ణ, సచివాలయం కార్యదర్శులు ఎం త్రినాథ్, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్టమైన బందోబస్తు

విశాలాంధ్ర-కొవ్వూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటన నేపథ్యంలో రోడ్ షో, సభా వేదిక వద్ద పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయ కర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాం పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం రాత్రి గ్యాలరీ ఇన్‌చార్జిలతో కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ లతో కలిసి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న విద్యా దీవెన కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. ఆ క్రమంలో రాష్ట్ర స్థాయి వేడుకకు వేదికగా కొవ్వూరు లో చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మే 24 బుధవారం ఉదయం 8.30 కు గుంటూరు జిల్లా తాడేపల్లి లోని సిఎం క్యాంపు కార్యాలయం నుంచి హెలిప్యాడ్‌కు చేరుకుని అక్కడ నుంచి ఉ 8.40 కు బయలుదేరి కొవ్వూరు కు కే జీ ఎం హై స్కూల్ లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ కు ఉ.9.20 కు చేరుకుంటారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులను కలవడం జరుగుతుంది. అక్కడ నుంచి ఉ.9 30 కు బయలుదేరి రోడ్ షో గా సత్యవతి నగర్ లోని బహిరంగ సభ .. సభావేదిక కు ఉ.9.40 కు చేరుకుంటారు. ఉ.9.45 నుంచి ఉ.11.15 కు సభాస్థలి కార్యక్రమంలో అక్కడ లబ్దిదారులతో ముఖాముఖి, ప్రముఖుల సందేశాలు, ముఖ్యమంత్రి సందేశం తదితర కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉ.11.20 కు సభా వేదిక నుంచి బయలుదేరి ఉ.11.30 కు కొవ్వూరు - హెలిప్యాడ్ కు చేరుకుంటారు. ఉ.11.30 నుంచి మ.12.00 వరకు స్థానిక ప్రజా ప్రతినిధులను కలుసుకుంటారు. మ.12.05 కు అక్కడ నుంచి బయలుదేరి తాడేపల్లి హెలిప్యాడ్ కు మ.12.45 చేరుకుని తదుపరి సిఎం క్యాంపు కార్యాలయం కు మ.12.55 కు చేరుకుంటారు. ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయ కర్త , కలెక్టర్ లు ఆర్డీవో కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఎస్. తేజ్ భరత్, ఆర్ ఎం సి మునిసిపల్ కె. తేజ్ భరత్, సహాయ కలెక్టర్ సీ. యశ్వంత్ కుమార్ రెడ్డి, ఆర్డీవో ఎస్. మల్లి బాబు, ఎ. చైత్ర వర్షిణి, ఇతర జిల్లా ఇతర జిల్లా అధికారులతో సమావేశం అయ్యారు.

ప్రజలను మభ్య పెట్టేందుకే
పోర్టుకు శంకుస్థాపన

విశాలాంధ్ర-మచిలీపట్నం : ఎన్నికల ముందు పోర్టుకు శంకుస్థాపన చేసి లబ్ధి పొందాలని ఈ వైసీపీ ప్రభుత్వం చూస్తుందని మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ అన్నారు. చిత్తశుద్ధిలేదని ప్రజలు వైఎస్ఆర్ పార్టీని ప్రజలు విశ్వసించడం లేదని,అమలు కాని వాగ్దానాలు చేయుట విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. మంగళవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు అవస్థలు పడుతున్నారని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారని పూర్తిస్థాయిలో వైద్యులను నియమించి పేద ప్రజల ప్రాణాలు కాపాడాలని, గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, రోడ్ల నిర్మాణం పట్ల దృష్టి సారించాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గడ్డం రాజు, గల్లా తిమోతి, వంపు గడవల చౌదరి, మహమ్మద్ సమీర్,దాదా, పినిశెట్టి వేణు,చిట్టూరి శివ ప్రసాద్, త్రిపురారి తరుణ్, ఈవన మణిబాబు, దేవర వీరబాబు, లంకె శ్రీనివాస్, ఉడుముల బుజ్జి, కొండా మేస్త్రి ,తోట భాస్కర్, శాయనశివ, బీరం సుదర్శన్, తోట రాజేష్, రామ్ జ్యోతి, గరికపాటి వెంకట్రావు, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ప్రోత్సాహం

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలు, కళారూపాలకు జీవం పోసి భావితరాలకు వాటిని అందిస్తున్న పేద కళాకారులను ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహిస్తుందని, కళాకారుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని కళాకారులకు మంజూరైన గుర్తింపు కార్డులను మంగళవారం కలెక్టర్ స్థానిక కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదరికంలో ఉండి అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నప్పటికి కళపై ఉన్న మక్కువతో కళా ప్రదర్శనలను కొనసాగిస్తూ సంస్కృతి, సాంప్రదాయాలకు జీవం పోస్తున్న కళాకారులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 58 ఏళ్ళు నిండిన నిరుపేదలైన కళాకారులకు నెలకు రూ.3 వేలు పెన్షన్ మంజూరు చేస్తుందన్నారు. అర్హులైన కళాకారులకు పెన్షన్ మంజూరు చేసేలా సాంస్కృతిక శాఖకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 200 మంది వృద్ధ కళాకారులకు పెన్షన్లను మంజూరు చేసినట్లు చెప్పారు. 3,463 మంది డప్పు కళాకారులకు గతంలో పెన్షన్లను మంజూరు చేసి నెలకు రూ.3 వేల చొప్పున రూ.1 కోటి 40 లక్షలు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా అందజేస్తున్నామన్నారు. జిల్లా అనేక మంది ప్రఖ్యాత కళాకారులకు జన్మనిచ్చిందని, వారి స్ఫూర్తితో అనేక మంది కళాకారులు ఇప్పటికి కళా ప్రదర్శనలను ప్రదర్శిస్తూ జీవితాన్ని కొనసాగిస్తున్నారన్నారు. కళాకారుల్లో ఎక్కువ మంది డప్పు కళపై ఆధారపడినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో జరిగే పండుగలు, జాతరలు, రాజకీయ సభలు, సమావేశాల సమయంలో మాత్రమే డప్పు కళాకారులకు జీవనోపాది లభిస్తుందన్నారు. డప్పు కళాకారులకు నృత్య గేయాలపై శిక్షణ అందించి వారి ప్రతిభను మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో జిల్లాకు చెందిన డప్పు కళాకారుల సేవలను వినియోగించుకునేలా అధికారులను ఆదేశిస్తామన్నారు. పౌరాణిక, సాంఘీక నాటక రంగాల్లో కళాకారుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలో అర్హత కలిగిన కళాకారులకు గుర్తుంపు కార్డులను మంజూరు చేసి తద్వారా కళాకారులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసంబందాల అధికారి ఎస్వీ.మోహన్‌రావు, ఆడియో విజువల్ సూపర్‌వైజర్ ఎ.సాయిబాబా, కళాకారుల సంఘాల ప్రతినిధులు, కళాకారులు పాల్గొన్నారు.